
శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న వృద్ధురాలు

కవాడిపల్లిలో ఉచిత వైద్య శిబిరం

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో శుక్రవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు సత్తయ్యగౌడ్, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షుడు పాండుగౌడ్, బాల్‌రెడ్డి, రమేష్‌గౌడ్, కృష్ణమూర్తి, కృష్ణగౌడ్, నర్సింహయాదవ్, చక్రపాణిగౌడ్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

భవనంపై నుంచి జారిపడి సూపర్‌వైజర్ మృతి

హయత్‌నగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి సూపర్‌వైజర్ మృతి చెందిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... పెద్ద అంబర్‌పేట్ సదాశివ ఎన్‌క్లేవ్‌లో హరికృష్ణారెడ్డి భవనం నిర్మిస్తున్నాడు. అక్కడ సూర్యాపేటకు చెందిన కొర్వి రమేష్(22) సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. రమేష్ తండ్రి అంజయ్య అక్కడే వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం ప్రమాదవశాత్తు రమేష్ భవనంపై నుంచి గేటుపైన పడి తీవ్ర గాయాలయి అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లీకుమార్తె అదృశ్యం


శ్రీలత, చిన్నిక

కొత్తపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తల్లీకుమార్తె బయటకు వెళ్లి తిరిగి రాని సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం... హస్తినాపురం సంతోషిమాత కాలనీలో ఉండే కడవరి నాగరాజు సెంట్రింగ్ పనులు చేస్తుంటాడు. భార్య శ్రీలత (20), కుమార్తె చిన్నిక (02)తో కలిసి ఈ నెల 25వ తేదీన బయటకు వెళ్లింది. పనికి వెళ్లిన నాగరాజు సాయంత్రం వచ్చేసరికి భార్య, కుమార్తె ఇంట్లో కనించలేదు. పరిసరాలు, బంధువుల ఇళ్లలో ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం నాగరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోనాల జాతరకు ఏర్పాట్లు పూర్తి


మాతామైదాన్‌లోని విజయదుర్గమాత ఆలయం, ప్రత్యేక అలంకరణలో మహాకాళి అమ్మవారు

సైదాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బోనాల ఉత్సవాలకు సైదాబాద్, మాదన్నపేట, మలక్‌పేట పరిసర ప్రాంతాలలో అమ్మవారి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. ఆదివారం, సోమవారం జరిగే బోనాల ఉత్సవాలకు ఆలయాలను రంగులతో, విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు ఆలయాల వద్ద రోడ్లకు ప్యాచ్ వర్క్‌లు, ప్రత్యేక వీధి దీపాలు, చెత్త కుప్పలు లేకుండా చర్యలు చేపడుతున్నారు. మాతా మైదాన్‌లోని విజయదుర్గ మాత దేవాలయం, జీవనజ్యోతి సంఘంలోని జయదుర్గాదేవి ఆలయం, మాతృశ్రీకాలనీలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయం, రెడ్డిబస్తీలోని నాగులమ్మ టెంపుల్. మూడుగుళ్లు, విష్ణునగర్‌లోని పోచమ్మ దేవాలయం, పెద్దతోటలోని అమ్మవారి అలయం, కరన్‌బాగ్, మాదన్నపేట, సింగరేణి కాలనీలలోని అమ్మవారి దేవాలయాలలో బోనాల మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశారు. సైదాబాద్ ప్రధాన రహదారిపై సోమవారం జరిగే ఘట్టాల ఊరేగింపులో ఎక్కడ ఏలాంటి అవాంచనీయ సంఘటనలు తలెత్తకుండా సైదాబాద్, మాదన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. కీలక ప్రాంతాలలో ప్రత్యేక సాయుధ పోలీస్ పికెట్‌లను మోహరించనున్నట్లు సైదాబాద్ ఏసీపీ వెంకన్ననాయక్ తెలిపారు.

వనస్థలిపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం కాంప్లెక్స్‌లోని మహాకాళి దేవాలయంలో ఆదివారం బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఫౌండర్ ఛైర్మన్, మాజీ కౌన్సిలర్ నీళ్ల అంజన్ కుమార్ గౌడ్ తెలిపారు.

బీఎన్‌రెడ్డినగర్ చౌరస్తాలోని దుర్గా పోచమ్మ దేవాలయంలో ఆదివారం బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ ముద్దగౌని శేఖర్ గౌడ్ అన్నారు. ఆదివారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బోనాల ఉత్సవాలు ప్రారంభమైవుతాయన్నారు.

తెలంగాణ బడ్జెట్‌పై బీజేపీ నేతల నిరసన


ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నేతలు

సైదాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్ పేరుతో సీఎం రేవంత్ సర్కార్ అంకెల గారడీ చేసి ప్రజలను మభ్యపెడతుందని ఆరోపిస్తూ శుక్రవారం ఐఎస్‌సదన్ చౌరస్తాలో యాకుత్‌పురా నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ బండ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నేతలు రాష్ట్ర ప్రభుత్వం దిష్టి బొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, మాజీ కార్పొరేటర్ సహదేవ్ యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి వీరేందర్ బాబు. నాయకులు నిరంజన్ యాదవ్, ప్రమోద్, మోహన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దళిత సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం

సరూర్‌నగర్, జూలై 26(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం దళిత సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తుందని, బడ్జెట్‌లో దళిత సంక్షేమానికి సంబంధించిన నిధుల్లో కోత పెట్టడమే దీనికి నిదర్శనమని బీజేపీ నేతలు ఆరోపించారు. బడ్జెట్‌లో కోత విధించడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కుంటె భాస్కర్ ఆధ్వర్యంలో బడంగ్‌పేట్‌లో సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు.

విద్యకు తక్కువ నిధులు

చంపాపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యకు తక్కువ నిధులు కేటాయించడం ఎంత వరకు సమంజసమని కార్పొరేట్ విద్య నియంత్రణ రాష్ట్ర జేఏసీ ఛైర్మన్ చెన్నోజు శ్రీనివాసులు ప్రశ్నించారు. విద్యకు 15 శాతం నిధులు కేటాయిస్తామని వాగ్దానం చేసి 7.3 శాతం నిధులు కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు.


ఎన్జీవోస్ కాలనీలోని అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న మునిసిపల్ సిబ్బంది

అక్రమ నిర్మాణం కూల్చివేత

వనస్థలిపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణాలకు అడ్డ.. బీఎన్‌రెడ్డినగర్ గడ్డ అనే శీర్షికతో ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి మునిసిపల్ అధికారులు స్పందించారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ ఎన్జీవోస్ కాలనీలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిర్మిస్తున్న భవనాన్ని అధికారులు రెండు నోటీసులు జారీ చేసిన అనంతరం శుక్రవారం కూల్చి వేశారు. ఈ సందర్భంగా హయత్‌నగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగం ఏసీపీ పావని మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ అనుమతి ప్రకారమే నిర్మాణాలు చేపట్టాలని లేనిచో అట్టి నిర్మాణాలను కూల్చివేస్తామన్నారు. తమ దృష్టికి వచ్చిన అక్రమ నిర్మాణదారులకు నోటీసులు అందజేసిన అనంతరం నిర్మాణాలను కూల్చివేస్తామని తెలిపారు.

కార్గిల్ యుద్ధవీరుల స్ఫూర్తితో శాంతి కోసం పోరాడాలి

- ఏఐపీఎస్ఓ రాష్ట్ర సమన్వయకర్త వెంకటేశ్వర్లు

ఎల్‌బీనగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కార్గిల్ యుద్ధవీరుల స్ఫూర్తితో ప్రపంచ శాంతి కోసం పోరాడాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఏఐపీఎస్ఓ) రాష్ట్ర సమన్వయకర్త వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. కార్గిల్ దివస్‌ను పురస్కరించుకుని ఏఐపీఎస్ఓ రంగారెడ్డి జిల్లా కమిటీ అధ్యక్షుడు తిప్పర్తి మహేష్ అధ్యక్షతన సరూర్‌నగర్‌లోని సాగరిక స్కూల్‌లో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుద్ధం వద్దు శాంతి కావాలని, ప్రపంచ శాంతి కోసం ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. ప్రపంచంలో యుద్ధాల వల్ల తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. ఎక్కడా యుద్ధం జరగకుండా ప్రపంచ శాంతి కోసం అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షవర్గ సభ్యులు రఘుపాల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాచం సత్యనారాయణ, కార్యదర్శి పల్లె వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా కార్యనిర్వాహక కార్యదర్శిగా సందీప్

సరూర్‌నగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా బడంగ్‌పేట్‌కు చెందిన లాలా సందీప్ నియమితులయ్యారు. ఈ మేరకు మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ శుక్రవారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. తనపై నమ్మకంతో అప్పగించిన పదవికి తగిన న్యాయం చేస్తానని సందీప్ పేర్కొన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- మేయర్ పారిజాతారెడ్డి


నీటి మడుగులో యాంటీ లార్వా బాల్స్ వేయిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని వ్యాధులు ప్రబలకుండా జాగ్రత పడాలని బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతారెడ్డి సూచించారు. ఫ్రైడే డ్రైడేలో భాగంగా శుక్రవారం 30వ డివిజన్‌లోని పలు కాలనీల్లో కార్పొరేటర్ భీమిడి స్వప్నాజంగారెడ్డి, కమిషనర్ జి.రఘుతో కలిసి ఆమె పర్యటించారు. అక్కడి పరిసరాలను పరిశీలించి సిబ్బందితో పారిశుధ్య పనులు చేయించారు. నీరు నిల్వ ఉన్న మడుగుల్లో దోమల నివారణకు యాంటీ లార్వా బాల్స్ వేయించారు. చెత్తను చెత్త రిక్షాల్లోనే వేయాలని సూచించారు.

యూజీడీ పనులకు శంకుస్థాపన

30వ డివిజన్‌లోని మెట్రో సిటీ కాలనీలో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణం పనులను మేయర్ పారిజాత ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాకేశ్, బీఆర్ఎస్ నాయకుడు బి.జంగారెడ్డి, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎలివేటెడ్ పిల్లర్లపై ఫ్లై ఓవర్ నిర్మించాలి

హయత్‌నగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): విజయవాడ జాతీయ రహదారిపై హయత్‌నగర్, వనస్థలిపురం పనామా చౌరస్తా వద్ద నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ డిజైన్ మార్చాలని కోరుతూ శుక్రవారం రంగారెడ్డి జిల్లా అర్బన్ బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, హయత్‌నగర్ కార్పొరేటర్ నవ జీవన్‌రెడ్డి మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్‌తో కలిసి కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ రహదారిపైన అండర్ పాస్‌కు బదులుగా పిల్లర్లపై ఫ్లై ఓవర్ వచ్చేలా డిజైన్ మార్చాలని కేంద్ర మంత్రిని కోరారు. వనస్థలిపురం మొదలుకుని హయత్‌నగర్ వరకు ఇప్పుడిప్పుడే అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

ప్రతి కాలనీలో వీధి దీపాలు వెలగాలి

చంపాపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని ప్రతి కాలనీ, బస్తీలలో వీధి దీపాలు వెలిగేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు కార్పొరేటర్ సుజాతనాయక్ అన్నారు. హస్తినాపురం డివిజన్‌లో శుక్రవారం కార్పొరేటర్ కాలనీ ప్రతినిధులకు విద్యుత్ లైట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోనాల పండుగ సందర్భంగా బస్తీలు, కాలనీలలో వీధి దీపాలు వెలిగేందుకు ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ విద్యుత్ డీఈ జగన్నాథం, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ ఏఈ హేమునాయక్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ఆయా కాలనీల ప్రతినిధులు యాదగిరి, శ్రీకాంత్‌రెడ్డి, అరుణ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు

వనస్థలిపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని శివారు కాలనీల్లో వర్షాలకు రోడ్లు అధ్వానంగా మారాయి. డివిజన్ బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు గౌరి మనోజ్ కుమార్ తన సొంత నిధులతో రెండు రోజులుగా రోడ్ల మరమ్మతులు పనులు చేయిస్తున్నాడు.